క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రామసముద్రం : మండలంలోని దిన్నెపల్లె వద్ద ఉన్న ఏపీ మోడల్‌స్కూల్ (ఆదర్శపాఠశాల)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ మునస్వామి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఉచిత విద్య కావాల్సిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పాఠశాలలో విద్యనభ్యసించుటకు ఎటువంటి ఫీజులు వసూలు చేయబడవని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 22 నుంచి జూన్ 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వాల్మీకిపురం: మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లి, గెలసంవారిపల్లి, మల్‌రెడ్డిగారిపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 6గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ మునిభాస్కర్ తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు.

గ్రామ వలంటీర్ విధుల నుంచి తొలగింపు

కేవీపల్లె : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన గ్రామ వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్ తెలిపారు. మండలంలోని గర్నిమిట్ట గ్రామ సచివాలయ పరిధిలో గ్రామ వలంటీర్‌గా పని చేస్తున్న కె. రమేష్‌పై గ్రామస్తులు పలువురు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రజలకు అందుబాటులో లేకపోవడం, ప్రభుత్వ కార్యక్రమాలకు గైర్హాజరు కావడం లాంటి అంశాలను పరిగణలోకి తీసుకుని కె. రమేష్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు

మదనపల్లె సిటీ: దివ్యాంగులు, వృద్ధులకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు ఉన్నాయని వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు పాఠశాలలో గ్లోబల్ యాక్సెసిబిలిటీ అవగాహన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సాంకేతికతను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపాల్ లీనాకుమారి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థికి తీవ్ర గాయాలు

ములకలచెరువు: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విష్ణువర్ధన్ అనే విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే రాగిమానుపల్లికి చెందిన విష్ణువర్ధన్ సొంత పని మీద ములకలచెరువుకు వచ్చి బస్టాండ్‌లో నిలబడి ఉండగా ఓ వృద్ధుడు బైక్‌లో వేగంగా వచ్చి ఢీకున్నాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

నేరాల నియంత్రణకు చర్యలు

తంబళ్లపల్లె: మండలంలో నేరాలు, అసాంఘిక కార్యక్రమాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మదనపల్లె డీఎస్పీ కేశప్ప ఆదేశించారు. శుక్రవారం తంబళ్లపల్లె పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. మండలంలో నేరాలపై ఎస్‌ఐ చంద్రమోహన్‌తో ఆరా తీశారు. పోలీసులు ప్రజలతో మమేకమై స్నేహబావంతో మెలగాలన్నారు. గ్రామాలలో మహిళా పోలీసులు, వలంటీర్ల సహాయంతో అసాంఘిక కార్యక్రమాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ సీఐ శివాంజనేయులు ఉన్నారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు ఎస్‌ఈబీ సీఐ మల్లిక ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం పెద్దమండ్యం మండలంలో దాడులు నిర్వహించారు. బండకిందతండా సమీపంలోని అటవీ ప్రాంతంలో నిల్వ ఉంచిన 200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

తంబళ్లపల్లె: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని నందకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని దిగువపాళ్యం, గుండ్లపల్లె, కొటాల పంచాయతీల్లో పర్యటించారు. దిగువపాళ్యం పంచాయతీల్లో 95 మంది కూలీలు చేపట్టిన సప్లయ్‌ఛానల్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇన్‌చార్జ్ ఏపీవో రామన్నను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఏలు శేఖరమ్మ, నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు అరుణమ్మ, రెడ్డిరాణి, గణేష్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

మదనపల్లె సిటీ: సమయపాలన ప్రకారం బస్సులు నడపాలని డిప్యూటీ సీఎంఈ ఇబ్రహీం అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ టు డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి కెఎంపిఎల్, ఈపీకె అధికంగా సాధించిన సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి విధులకు హాజరుకాకూడదన్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

ఎమ్మెల్యే నవాజ్‌బాషా


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, నాయకులు

నిమ్మనపల్లె : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాల్లో భాగంగా అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధిచేకూరుతోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ ఆచార్లపల్లె, గుండ్లబురుజు హరిజనవాడ, బొంతవారిపల్లె, గుండ్లబురుజు, గొల్లపల్లె తదితర గ్రామాల్లో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీపీ నరసింహులు, సింగల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైయస్సార్‌సీపీ ఇన్‌చార్జి రమణారెడ్డి, ఆర్బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాల జాబితా బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేను ఆప్యాయంగా పలకరించారు. నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న విధానంపై లబ్ధిదారులను ప్రశ్నించారు. ఇంకాఏమైనా సమస్యలున్నాయా అంటూ అడిగారు. ఇంటి స్థలం మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పలువురు రోడ్లు, మురుగునీటి కాల్వలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గుండ్లబురుజులో విద్యుత్ లైను సమస్యగా ఉందని మార్చాల్సిందిగా స్థానికులు కోరారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. దేశవ్యాప్తంగా పరిపాలనలో ఆంధ్ర రాష్ట్రం ప్రత్యేకస్థానం సంపాదించుకుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విధానాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిద్ధమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. మరోసారి ప్రజలందరూ ముఖ్యమంత్రికి మద్దతుగా నిలిచి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, వైయస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటు కార్యదర్శి కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ రెడ్డి వెంకటేష్, కోఆప్షన్ సభ్యులు మహ్మద్‌రఫీ, నాయకులు యుగంధర్ రెడ్డి, నరేంద్రరెడ్డి, ఆర్.శ్రీనివాసులురెడ్డి, బాబురెడ్డి, రవికుమార్‌రెడ్డి, చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్‌నాగరాజ, షావలి, మాణిక్యం పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ఇటీవల వివాహం చేసుకున్న వెంగంవారిపల్లె సచివాలయ ఉద్యోగి విజయ్‌కుమార్, గీతప్రియ దంపతులను ఎమ్మెల్యే నవాజ్‌బాషా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వారి ఇంటికి వెళ్లి ఆశీర్వదించారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నూతన దంపతుల వైవాహిక జీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

జగనన్న పాలనలో సంక్షేమాభివృద్ధి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఇతర అధికారులు

వాల్మీకిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జర్రావారిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందివ్వడంలో సీఎం జగనన్న దేశంలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. ప్రజల వద్దకు పాలన అనే లక్ష్యంతో సీఎం జగనన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేశారన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి డబ్బు లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసి అవినీతి లేకుండా చేశారన్నారు. సంక్షేమ పథకాల అమలు, రూపాయి లంచం లేకుండా నేరుగా అర్హులకే చేరే విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్నివర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. అలాగే జర్రావారిపల్లి సచివాలయం వద్ద అటవీశాఖ ఆద్వర్యంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, జడ్పీటీసీ నిర్మల, సర్పంచ్ మునిభాస్కర్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, అటవీశాఖ అధికారులు సుధాకర్, గిరినాథబాబు, జ్యోతి, బాలసుబ్రమణ్యం, నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్ళభాస్కర్, శ్రీధర్‌రాయల్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, చంద్రశేఖర్, ఆనంద, రాయుడు, వేణుగోపాల్ రెడ్డి, రవి, విశ్వనాథం, రాజబాబు, చలపతి, సుధాకర, షాహెద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు వేధింపులకు పాల్పడలేదు

– డీఎస్పీ కేశప్ప


మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప, సీఐ మురళీకృష్ణ

మదనపల్లె : వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో తంబళ్లపల్లె పోలీసులు ఎటువంటి వేధింపులకు పాల్పడలేదని డీఎస్పీ కేశప్ప అన్నారు. శుక్రవారం స్థానిక టూటౌన్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణం అనపగుట్టలో ఆత్మహత్య చేసుకున్న పెద్ద నరసింహులు నాయుడు (70), భార్య వెంకట సుబ్బమ్మలపై తంబళ్లపల్లె పోలీసులు ఎటువంటి వేధింపులకు పాల్పడలేదని స్పష్టం చేశారు. అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం ఉందని, వివాద పరిష్కారంలో భాగంగా తమ్ముడు అప్పలనాయుడు తంబళ్లపల్లె పోలీసులను ఆశ్రయించి పెద్ద నరసింహులునాయుడుపై ఈనెల 17వ తేదీన ఫిర్యాదు చేశాడన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారే గానీ, అసభ్య పదజాలంతో మాట్లాడటం, దూషించడం చేయలేదన్నారు. ఈ విషయమై తాము అంతర్గత విచారణ చేశామన్నారు. కార్యక్రమంలో టూటౌన్‌సీఐ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటకు రూ.4.70 కోట్లు మంజూరు

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ అభివృద్ధికి రూ.4.70 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నగర పంచాయతీగా 2021 జనవరి నుంచి మున్సిపాల్ పాలన ప్రారంభమైంది. అన్నివిధాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనిపై ఇప్పటికే ఉన్నతస్థాయి అధికారులు అభివృద్ధి పనులు చేపట్టేందుకు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి వెళ్లగా తాజాగా ప్రభుత్వం పనులు చేపట్టేందుకు పాలనాపరమైన అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రూ.4.70 కోట్ల నిధుల్లో రూ.2.70 కోట్లను నగర పంచాయతీ ప్రజలకు తాగునీటి సరఫరా కోసం కేటాయించారు. ఈ నిధులతో సంతబజారులో 9.50 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మిస్తారు. పలుప్రాంతాల నుంచి నీటిని ట్యాంకుకు పంపింగ్ చే శాక కుళాయిలకు సరఫరా చేస్తారు. ఇంటింటికి కొళాయిలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నిధుల్లో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చెరిసగం భరిస్తారు. మరో రూ.2 కోట్లతో స్థానిక పెద్దచెరువును అభివృద్ధి చేస్తారు. చెరువులోకి వస్తున్న మురికినీటిని మళ్లించేందుకు డైవర్షన్ ఛానల్ నిర్మాణం, చెరువుకట్ట సుందరీకరణ పనులు చేపడ్తారు. ఈ నిధుల్లో కేంద్రం రూ.80 లక్షలు, రాష్ట్రం రూ.80 లక్షలు, నగర పంచాయతీ రూ.40 లక్షలు భరిస్తాయి. దీనిపై ఏఈ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు చేపట్టేందుకు త్వరలో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

డంపింగ్ యార్డు పనులు పూర్తి చేయండి

– డీపీఓ ధనలక్ష్మి


బొమ్మనచెరువు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డీపీఓ ధనలక్ష్మి

మదనపల్లె : బొమ్మనచెరువు పంచాయతీలో డంపింగ్‌యార్డు పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డీపీఓ ధనలక్ష్మి పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ సచివాలయాన్ని డీపీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులు, సిబ్బంది అటెండెన్స్, మూమెంట్, గ్రీవెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. నోటీసు బోర్డులో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లను ప్రదర్శించడం, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, హౌసింగ్ పథకంలో లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డితో కలిసి రూ.6లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డంపింగ్‌యార్డును పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా జరిగేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవాలని సెక్రటరీ పద్మకుమారిని ఆదేశించారు. పారిశుధ్యపనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో జలప్రసాదం


జలప్రసాదం ఏర్పాటు చేసిన వాసవిక్లబ్ సభ్యులు

పీలేరు : పీలేరు వాసవిక్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో జలప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని పది ప్రధాన ప్రాంతాలలో కూలింగ్ వాటర్ క్యాన్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లేబర్ ఆఫీసర్ ఆనంద్ బాబు మాట్లాడుతూ వేసవి తాపానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో ప్రజల దాహార్తి తీర్చడానికి కూలింగ్ వాటర్ క్యాన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీలేరు వాసవిక్లబ్ గ్రేటర్, వాసవి కపుల్స్ క్లబ్ నాయకులు పామిడి నాగరాజ, సోమిశెట్ట సురేష్‌బాబు, జయచంద్ర, జుటూరు అరవింద్‌బాబు, ఆమూరి శివపనేష్, గోవర్దన్, సుబ్బరాజ, మహిధర్, శంకర్‌నాథ్, సుమంత్, చైతన్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సొంతిళ్లు ఇవ్వడమే ధ్యేయం


జగనన్న లేఅవుట్‌లో నూతన ఇంటిని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సఫ్రీన్ ముక్తియార్

గుర్రంకొండ: అర్హులైన పేదలందరికీ సొంతిళ్లు ఇవ్వడమే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయమని జెడ్పీటీసీ సఫ్రీన్ ముక్తియార్ అన్నారు. శుక్రవారం స్థానిక జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారుడు అహ్మద్ బాషా నూతనంగా నిర్మించుకొన్న వైఎస్సార్ గృహకల్ప ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జగనన్న లేఅవుట్‌లో 225 ఇళ్లు ఇచ్చామన్నారు. ఇప్పటికే పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొన్నారన్నారు. ప్రతి ఒక్క పేద వాడు సొంత ఇంటిని కలిగి ఉండాలనే సీఎం ధ్యేయమన్నారు. పేదల కష్టాలను తెలుసుకొని అన్ని సౌకర్యాలను కల్పిస్తున్న ప్రభుత్వాన్ని అందరూ మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రజాక్, రాజు, మగ్బూల్, అహ్మద్‌భాషాలు పాల్గొన్నారు.

జలజాగరణ దీక్షను విజయవంతం చేద్దాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాయలసీమ సాగునీటి సాధనసమితి సభ్యులు

మదనపల్లె : రాయలసీమ సాగునీటి హక్కుల కోసం సిద్ధేశ్వరం అలుగు–రాయలసీమ వెలుగు నినాదంతో మే 31న నిర్వహిస్తున్న సిద్ధేశ్వరం జలజాగరణదీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో సిద్ధేశ్వరం జలజాగరణ దీక్ష పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. నిర్లిప్తంగా ఉన్న రాయలసీమ సమాజాన్ని జాగృతం చేసేందుకు మే 31 సాయంత్రం 6 గంటల నుంచి జూన్ 1 ఉదయం 10 గంటల వరకు నంద్యాలజిల్లా సంగమేశ్వరంలో జలజాగరణ దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో సిద్ధేశ్వరం అలుగుతో పాటు సీమ సాగునీటి స్థిరీకరణ ప్రాజెక్టులు, సీమ ప్రాజెక్టులకు చట్టబద్ధమైన సాగునీటిహక్కులు, కృష్ణానది యాజమాన్యబోర్డు కార్యాలయం కర్నూలులో ఏర్పాటు, పరిపాలన, అభివృద్ధి వికేంద్రీకరణలో సమాన అవకాశాలతో రాయలసీమ సమాజ సమగ్రాభివృద్ధిపై చర్చించడం జరుగుతుందన్నారు. ప్రతి రాయలసీమ పౌరుడు జలదీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథ్, శ్రీచందు, కొండుపల్లె ఆనంద్, వి.ఉత్తన్న, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గొడసాని వెంకటరమణ, మోహన్‌రెడ్డి, సయ్యద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఎల్ కెరీర్ ప్రోగ్రామ్ ద్వారా ఉపాధి అవకాశాలు

23వ తేదీన ఇంటర్వ్యూలు

మదనపల్లె : ఇంటర్మీడియట్‌లో 2022, 2023 విద్యాసంవత్సరాల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హెచ్‌సీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో టెక్‌బీ ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఈఎస్‌సీ కోఆర్డినేటర్ భరత్ శంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని మిషన్‌కాంపౌండ్ ఎదురుగా ఉన్నటువంటి విశ్వహిత డిగ్రీ కళాశాలలో 23వ తేదీన హెచ్‌సీఎల్ కెరీర్ ప్రోగ్రామ్‌కు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎంపికైన వారికి హెచ్‌సీఎల్ కంపెనీలో ఐటీ/ఎస్‌డీ/డీపీఓ ఉద్యోగాలకు రూ. ఏడాది శిక్షణలో 7వ నెల నుంచి 12వ నెలవరకు ఇంటర్న్‌షిప్‌తో నెలకు రూ.10,000 స్టైఫండ్ ఇవ్వడంతో పాటుగా ట్రైనింగ్ పూర్తి చేసిన తర్వాత ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమ ఉన్నతవిద్యను ఐఐఎం, బిట్స్, శస్త్ర, ఏఎంఐటీవై, కేఎల్ విశ్వవిద్యాలయాల్లో స్కాలర్‌షిప్ పొందుతూ అభ్యసించవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఏపీఎస్‌ఎస్‌డీసీ అధికారులను 6301612761, 9741432931, 9052717078, 8897776368 ఫోన్ నెంబర్లపై సంప్రదించాలన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి


టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలతో అధికారులు

తంబళ్లపల్లె: యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలతోనే కాకుండా స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిక్రిష్ణ కోరారు. శుక్రవారం స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో స్కిల్‌హబ్ సెంటర్‌లో టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషి ఫలితంగా ఐటీఐలో స్కిల్‌హబ్ సెంటర్లద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 30 మంది మహిళలు టైలరింగ్ శిక్షణ పూర్తి చేయడం హర్షణీయమన్నారు. వైఎస్సార్ క్రాంతిపథం ఏపీయం గంగాధర్ మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు మండల సమాఖ్యల ద్వారా ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీ ఎస్‌డీఈ హరీఫ్,ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

మదనపల్లె : వాల్మీకిపురం, తంబళ్లపల్లె, మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 13 అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులకు శుక్రవారం సబ్‌కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ధనలక్ష్మి, ఆర్డీఓ ఎం.ఎస్. మురళి అభ్యర్థులకు అంగన్‌వాడీ నిర్వహణపై అవగాహనను పరిశీలించారు. మొత్తం 13 అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 24 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

వేరుశనగ విత్తనకాయలు పంపిణీకి సిద్ధం

పెద్దతిప్పసముద్రం: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ద్వారా రైతులకు అందజేసే రాయితీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఓ ప్రేమలత అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాలకు కలిపి మొత్తం 12 వేల బస్తాల కే సిక్స్ విత్తన కాయలు మంజూరు అయ్యాయన్నారు. 30 కిలోల బస్తా కాయలు రూ.1,674ల చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. ఎకరా లోపు పొలం ఉన్న రైతుకు 2 బస్తాలు, 2 ఎకరాలకు పైగా ఎంత పొలం ఉన్నా మూడు బస్తాలు మాత్రం అందజేస్తామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన అనంతరం కాయలను రైతులకు పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు.

గ్రంథాలయాలతో సంపూర్ణ విజ్ఞానం


విద్యాసామగ్రి అందజేస్తున్న లయన్స్ క్లబ్ అభయ సభ్యులు

మదనపల్లె సిటీ: గ్రంథాలయాలు సంపూర్ణ విజ్ఞానం అందిస్తాయని లయన్స్ క్లబ్ అభయ ప్రతినిధులు జయదేవ్‌రెడ్డి, సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణశిబిరానికి హాజరైన విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా చేసుకోకుండా ఇటువంటి సమ్మర్ క్యాంపులకు హాజరు కావాలని కోరారు. ప్రస్తుతం విద్యార్థులు మొబైల్ ఫోన్, టీవీలకు అలవాటు పడిపోయి పుస్తక పఠనాన్ని మర్చిపోతున్నారన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను తరచూ సందర్శించి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి వసంత కుమారి మాట్లాడుతూ అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అభయ సర్వీసెస్ చైర్మన్ సాయిశేఖర్‌రెడ్డి, సమ్మర్ క్యాంపు ఉపాధ్యాయులు రెడ్డప్ప, ప్రసాద్‌శర్మ, మదన్‌మోహన్, చంద్రకళ, రమణమ్మ, టీఎస్.ఎ.క్రిష్ణమూర్తి, రామమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెద్దతిప్పసముద్రం: సరిహద్దు కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకా దిగవకోటలో ప్రఖ్యాత గాంచిన పురాతన కాలం నాటి కాత్యాయిని విశ్వేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దతిప్పసముద్రంలోని శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఆకుల మల్లికార్జున, కైవారం కేఎం.శ్రీనివాసుల సహకారంతో అమావాస్య శివలింగానికి ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పంచామృతాభిషేకం, ఏకదశవార రుద్రాభిషేకం,గణపతి హోమం, రుద్ర హోమం,పూర్ణాహుతి, మహా మంగళహారతి కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

బి.కొత్తకోట: మండలంలోని గట్టులో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయం ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగం శుక్రవారం రాత్రి కళ్యాణోత్సవ వేడుక కన్నుల పండువగా సాగింది. టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎ.సుబ్రమణ్యం దంపతులు ఇంటినుంచి వేడుకకు పట్టువస్త్రాలు, మాంగల్యం, ఇతర కళ్యాణ వస్తువులను శాస్త్రోక్తంగా తీసుకొచ్చారు. ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులకు కళ్యాణోత్సవ వేడుకను నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి తిలకించారు. అనంతరం గరుడసేవ నిర్వహించగా స్వామి ఉత్సవ విగ్రహాన్ని గట్టు పురవీధుల్లో ఊరేగించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మదనపల్లె సిటీ: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని హాకీ సీనియర్ కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, నౌషాద్ అన్నారు. శుక్రవారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో వేసవి హాకీ శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులకు రోజా హోటల్ నిర్వాహకులు కంభం నాగభూషణరెడ్డి అల్పాహారం అందజేశారు. కోచ్‌లు మాట్లాడుతూ వేసవి శిబిరంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం


శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహాలయంలో శుక్రవారం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. షిరిడిసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు స్వామివారి కల్యాణోత్సవాన్ని భక్తులకు వివరిస్తూ శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా వల్లీదేవసేన సమేత స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి, అన్నదానం చేశారు.